

ప్రవీణ్ నెట్టారు హత్య కేసులో కీలక నిందితుడి అరెస్ట్

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లాలో రెండేళ్ల క్రితం సంచలనం రేపిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త ప్రవీణ్ నెట్టారు హత్య కేసులో కీలక నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. రెండేళ్లుగా అజ్ఞాతంలో ఉన్న ముస్తాఫా పైచార్‌ను ఎన్‌ఐఏ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. 2022 జూలై 26న సుళ్య తాలూకా బెళ్లారె గ్రామ సమీపంలోని పర్వాజె క్రాస్ వద్ద చికెన్‌స్టాల్ నిర్వహిస్తున్న ప్రవీణ్‌ను రాత్రి ముగ్గురు తల్వార్‌లతో దాడి చేసి హతమార్చారు. ముస్తఫా అరెస్ట్‌పై నెట్టారు కుటుంబికులు హర్షం వ్యక్తం చేశారు. నిందితుడికి ఉరి శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.





కొత్త పీయూ కళాశాలలకు గ్రీన్‌సిగ్నల్

- సైన్స్ కాలేజీలే అత్యధికం..
- 172లో 171 ప్రైవేట్ యాజమాన్యం
- ప్రభుత్వ కాలేజీలకు తగ్గిన ఆదరణ

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ఏటా పదో తరగతి ఉత్తీర్ణులయ్యేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అందుకు అనుగుణంగా ప్రతి విద్యాసంవత్సరంలోనూ పీయూ కళాశాలలను పెంచుకోవాల్సిన పరిస్థితి అనివార్యమవుతోంది. గత నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ ఏడాది 2023-24 విద్యాసంవత్సరంలో 10శాతం ఉత్తీర్ణత తగ్గింది. అయితే పరీక్షలు రాసేవారి సంఖ్య పెరుగుతున్న కారణంగా విద్యార్థులందరికీ పీయూ విద్య అందుబాటులో ఉండాలంటే ఎక్కువ కళాశాలలు ఏర్పాటు తప్పనిసరి అవుతోంది. కొత్తగా పీయూ కళాశాలల ఏర్పాటుకోసం 339 దరఖాస్తులు పీయూ బోర్డుకు చేరాయి. వీటిలో 172 పీయూ కళాశాలలకు అనుమతులు జారీ చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే కళాశాలలు ప్రారంభం కానున్నాయి. 172 పీయూ కళాశాలలకు అనుమతులు మంజూరు కాగా వీటిలో 171 ప్రైవేట్ కాగా, ప్రభుత్వ పీయూ కళాశాల ఒకటి మాత్రమే ఉంది. ఏటా పీయూ కళాశాలల ఏర్పాటుకు వందలాది దరఖాస్తులు వస్తుంటాయి. వీటిలో అధిక శాతం సైన్స్ కళాశాలలకే ఉంటాయి. కొన్ని కళాశాలల్లో కామర్స్ కోసం ఉండగా కేవలం ఆర్ట్స్ కళాశాలల ఏర్పాటుకు దరఖాస్తులు ఉండవు. సైన్స్‌లో చరిత్ర, అర్థశాస్త్రం సబ్జెక్టులకు బదులుగా స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ ఆప్షనల్ సబ్జెక్టులకు డిమాండ్ ఉంది. ఈ ఏడాది కొత్తగా పీయూ కళాశాలల ఏర్పాటుకోసం వస్తున్న దరఖాస్తుల్లో బెంగళూరునుంచే అత్యధికంగా ఉన్నాయి. బెంగళూరు ఉత్తర 21, దక్షిణ 37, బెంగళూరు గ్రామీణ 12 కాగా విజయపుర 26, కలబురగి 19, దావణగెరె 15, రాయచూరు 14, బళ్ళారి 13, మైసూరు 12, దక్షిణకన్నడ, శివమొగ్గ, తుమకూరు జిల్లాలనుంచి 10 చొప్పున దరఖాస్తులు రాగా కొడగు నుంచి కేవలం ఒక దరఖాస్తు మాత్రమే వచ్చింది. రాష్ట్రంలో 1229 ప్రభుత్వ పీయూ కళాశాలలు ఉండగా 797 ఎయిడెడ్ కళాశాలలు, 3,174 అన్ ఎయిడెడ్ కళాశాలలు, 165 విభజిత పదవీపూర్వ కళాశాలలు ఉన్నాయి. నీట్, సీఈటీ, జేఈఈలలో ప్రవేశాలకై విద్యార్థులు ఆసక్తి చూపుతున్న కారణంగా పీయూలో సైన్స్ అనుబంధమైన కోర్సులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రైవేట్ కళాశాలలు ఫీజులు పెంచినా వాటిపట్లనే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం విద్యాసంస్థలపై పర్యవేక్షించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి.

- దక్షిణకన్నడ జిల్లా హారేకళ హాజప్ప పీయూ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల ప్రవేశానికి అనుమతులు ఇచ్చారు. బెంగళూరు ఉత్తరలో 10, దక్షిణలో 16, గ్రామీణలో 6 కళాశాలలు ప్రారంభం కానున్నాయి. బెంగళూరు కంటే అధికంగా విజయపుర 17, కలబురగి 14 కళాశాలలకు అనుమతులు దక్కాయి. రాయచూరులో 7, తుమకూరు 6, శివమొగ్గ 5 కళాశాలలకు అనుమతులు ఇచ్చినట్టు పీయూ బోర్డు డైరెక్టర్ సింధు బీ రూపేశ్ వెల్లడించారు.

బసవణ్ణ తత్వాలు నిత్యం ఆచరణీయం



మైసూరులో బసవణ్ణ చిత్రపటానికి సీఎం సిద్ధరామయ్య పుష్పాంజలి

- బసవ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): విశ్వమానవుడు బసవణ్ణ సమసమాజ నిర్మాణం కోసం 12వ శతాబ్ధంలోనే చైతన్యం తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి అని, ఆయన తత్వాలు నిత్యం ఆచరణీయమని సీఎం సిద్ధరామయ్య కొనియాడారు. బసవజయంతిని పురస్కరించుకుని మైసూరు గన్‌హౌస్ బసవేశ్వర సర్కిల్‌లో బసవణ్ణ విగ్రహానికి పూలమాల సమర్పించారు. సుత్తూరు మఠాధిపతి శివరాత్రి దేశికేంద్ర స్వామీజీ, మంత్రి మహదేవప్ప, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పుష్పఅమరనాథ్, ఎమ్మెల్యే హరీశ్‌గౌడ పాల్గొన్నారు. విధానసౌధ ప్రాంగణంలో బసవణ్ణ చిత్రపటానికి డీసీఎం డీకే శివకుమార్, పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి, మంత్రి ఈశ్వర్‌ఖండ్రె, ధారవాడ ఎమ్మెల్యే వినయ్‌కులకర్ణి తదితరులు పుష్పాంజలి ఘటించారు. రాష్ట్ర వ్యాప్తంగా బసవజయంతి వేడుకలు సాగాయి. బీజేపీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. జేడీఎస్, కాంగ్రెస్ కార్యాలయాలతోపాటుపలు విద్యాసంస్థలు వీరశైవలింగాయత సంఘాల ఆధ్వర్యంలోనూ కార్యక్రమాలు సాగాయి. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బసవణ్ణ చిత్రపటానికి ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు, విద్యార్థులు జయంతి వేడుకలు జరిపారు.



బీజేపీ కార్యాలయంలో..

సీఎం పదవి కోసం ఆత్రుత వద్దు

- డీకే శివకుమార్‌కు సోమణ్ణ సూచన

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): సీఎం పదవి కోసం డీకే శివకుమార్ ఆత్రుత పడరాదని బీజేపీ నేత, తుమకూరు లోక్‌సభ అభ్యర్థి సోమణ్ణ సూచించారు. శుక్రవారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ డీకే శివకుమార్ జేడీఎస్ నేత, మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబంపై విమర్శలను ఆపాలని సూచించారు. కుమారస్వామి, డీకే శివకుమార్‌ల మధ్య సాగుతున్న వాగ్వాదం సమంజసంగా లేదన్నారు. తప్పు చేసినవారికి శిక్ష అనివార్యం కావాలని అయితే వారిద్దరూ గతంలో ఆప్తులుగా ఉన్నారని ప్రస్తుతం ఈ విషయంలో నిరంతరం కత్తులు దూసుకునేలా మాట్లాడడం తగదన్నారు. జేడీఎస్, కాంగ్రెస్‌లోని ఒక్కలిగ సామాజికవర్గానికి చెందిన వారి మధ్య విభేధాలు తారస్థాయికి చేరుతున్నాయన్నారు. ఇద్దరి తరఫున సమాజానికి చెందినవారు రెండుగా చీలిపోతారన్నారు. ఓ ప్రశ్నకు సమాధానంగా డీకే శివకుమార్ ఇప్పటికే అన్ని పదవులను అలంకరించారని, అత్యున్నతమైన సీఎం పదవికి ఓ అడుగు దూరంలో ఉన్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన సీఎం కావాలని తానూ భావించానన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆత్రుతగా నిర్ణయం తీసుకుంటే ఇబ్బందులు తప్పవని అభిప్రాయపడ్డారు.



ఏపీలో ఎన్నికల ప్రచారానికి డీసీఎం డీకే

మడకశిర టౌన్, మే 10: ఏపీలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో డీప్యూటీ ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొననున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం రొళ్ళ మండల కేంద్రంలో జరిగే బహిరంగ సభకు హాజరు కానున్నట్లు తెలిపారు. సీడబ్ల్యూసీ సభ్యులు ఎన్.రఘువీరారెడ్డితో పాటు పలువురు కర్ణాటక నేతలు ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు రొళ్ళకు చేరుకొంటారని నాయకులు కార్యకర్తలు, అభిమానులు, నాయకులు అధిక సంఖ్యలో హాజరు అయి కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఏపీలో మరోసారి కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని పేర్కొన్నారు.





విద్యానిపుణుడికి పద్మశ్రీ ప్రదానం

బెంగళూరు, మే 10(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా అధ్యాపకుడిగా సేవలందించిన విద్యానిపుణుడు ఎంకే శ్రీధర్‌కు పద్మశ్రీ గౌరవం దక్కింది. ఇటీవల జనవరిలో ఎంకే శ్రీధర్‌కు కేంద్రప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది. గురువారం ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 'పద్మశ్రీ' పురస్కారాన్ని ఎంకే శ్రీధర్‌కు ప్రదానం చేశారు. ఈమేరకు నగరంలోని చాణక్య యూనివర్సిటీ అధ్యాపకులతోపాటు పలు విద్యాసంస్థల ముఖ్యులు శ్రీధర్‌ను అభినందించారు. విద్యార్థులకు ఆయన చేసిన విద్యా సేవలను పలువురు కొనియాడారు.

పద్మశ్రీ పురస్కారం అందజేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము




ఘోరం..

- జిందాల్ స్టీల్ కంపెనీలో ప్రమాదం
- నీటి తొట్టెలో పడి ముగ్గురు ఇంజనీర్ల దుర్మరణం
- మరమ్మతులు చేస్తుండగా దూసుకొచ్చిన ప్రవాహం

బళ్లారి,మే10(ఆంధ్రజ్యోతి): జిందాల్ స్టీల్ వర్క్స్ కంపెనీ(జేఎస్‌డబ్ల్యూ)లో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ముగ్గురు సివిల్ ఇంజనీర్లు ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో బళ్లారి ఎస్పీ రంజిత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిందాల్ కంపెనీలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో హొసపేటెకు చెందిన పంతి జడెప్ప,(31) చెన్నైకి చెందిన శివమదేవ్(22) బెంగళూరుకు చెందిన సువాంత్ కృష్ణ నైనార్(23) పని చేస్తున్నారు. కంపెనీలో ఇనుము తయారు చేసి వాటిని చల్లార్చేందుకు భారీ నీటి తొట్టెలు ఉన్నాయి. వీటికి చెరువు నుంచి పైపుల ద్వారా నీటిని సరఫరా చేస్తారు. అయితే గురువారం నీటిని సరఫరా చేసే పైపుల్లా నీరు ఆగిపోవడంతో ఆ ముగ్గురు ఇంజనీర్లు మరమ్మతుల కోసం పైపుల్లోకి వెళ్లి మరమ్మతులు చేస్తున్న సమయంలో చెరువులో నుంచి నీరు ఒక్కసారిగా వచ్చాయి. పైపుల్లో పనిచేస్తునన్న ఈ ముగ్గురు ఇంజనీర్లు సుమారు 100 మీటర్ల వరకూ కొట్టుకొచ్చి నీటి తొట్టిలో పడి చనిపోయారు. గురువారం రాత్రి ఒకరి మృత దేహం బయటకు తీశారు. శుక్రవారం ఉదయం ఒకరిది, మధ్యాహ్నం మరొక మృతదేహం వెలికి తీశారు. మృతదేహాలకు బళ్లారి విమ్స్ ఆస్పత్రిలో పోస్టు మార్టం నిర్వహించారు. ఈ దుర్ఘటన పై జిందాల్ ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి దుర్ఘటనలు తరుచూ జరుగుతున్నా జిందాల్ కంపెనీ జాగ్రత్తలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదంలో ముగ్గురు చనిపోవడంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. జిందాల్ యాజమాన్యం పరిహారం చెల్లించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



మృతి చెందిన ముగ్గురు ఇంజనీర్లు (ఫైల్)



నీటి తొట్టెలో మృతదేహాలను వెలికితీస్తున్న సిబ్బంది

ఫెడెక్స్ పార్సిల్‌లో డ్రగ్స్..!

- రిటైర్డ్ ఇంజనీర్‌కు ఫోన్‌లో బెదిరింపులు
- రూ.1.60 కోట్లకు కుచ్చుటోపీ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మంగళూరు వాసి



బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కొరియర్ కంపెనీ 'ఫెడెక్స్' పేరిట భారీ మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఎంతోమంది కోట్లాది రూపాయలు కోల్పోయారు. బెంగళూరుకు చెందిన ఓ మహిళా అడ్వకేట్‌ను రెండు రోజులపాటు ఫోన్‌లోనే హింసించి భారీగా నగదు కాజేసిన విషయం మరువకముందే మంగళూరువాసికి అదే తరహాలోనే మోసం చేశారు. సీబీఐ ముంబై క్రైమ్ బ్రాంచ్ అధికారులంటూ మంగళూరుకు చెందిన 72ఏళ్ల రిటైర్డు ఇంజనీర్‌కు ఫోన్‌కాల్ చేశారు. థాయ్‌లాండ్‌కు మీరు పంపిన పార్సిల్‌ను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారని, అందులో ఆఫ్ఘనిస్థాన్, కెన్యాకు చెందిన 5 పాస్‌పోర్టులు, 3 క్రెడిట్ కార్డులు, 140 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, 4 కేజీల బట్టలతోపాటు ఒక ల్యాప్‌టాప్ ఉందని తెలిపారు. సీబీఐ అధికారి రుద్ర రాథోడ్ అదనపు విచారణ జరుపుతారని, మెయిల్ వివరాలు పంపాలని సూచించారు. ఆ తర్వాత రుద్రరాథోడ్ పేరిట ఒక వ్యక్తి ఫోన్ చేసి మీరు బాండ్ రూపంలో డబ్బు కట్టాలని, విచారణలో మీరు పంపిన కవరులో ఎటువంటి మాదకద్రవ్యాలు లేవని తేలితే డబ్బు వాపసు చేస్తామని నమ్మించారు. ఈనెల 2న బ్యాంకు ఖాతా నుంచి 1.10 కోట్ల రూపాయలు, 6న 50 లక్షల రూపాయలు జమ చేసుకున్నారు. ఆ తర్వాత రోజు ఫోన్‌కాల్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించారు. వెంటనే ఇంజనీర్ సీఈఎన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



వదల బొమ్మాళీ వదల..!



తాము రాజీనామా చేసినా తమ పరిధిలోని ఓటర్లను మాత్రం వలంటీర్లు వదలడం లేదు. అధికార పార్టీకి సాయంగా గుట్టు చప్పుడు కాకుండా ప్రలోభ పెడుతూనే ఉన్నారు. రాజీనామా చేసిన వలంటీర్లకు ఆయా నియోజక వర్గ అధికార పార్టీ అభ్యర్థులు వేతనాలు ఇచ్చి ఈ పనులకు పురమాయిస్తున్న ట్లు తెలిసింది. ఈనేపథ్యంలోనే వలంటీర్లు ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమానికి తెర తీశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. అనంతపురం అర్బన్ వైసీపీ అభ్యర్థి తమ పరిధిలోని వలంటీర్ల ద్వారా ఓటర్లకు నగదు పంపిణీ చేపట్టారనే ఆరోపణ లు వినిపిస్తున్నాయి. ఇప్పటికే చాలా వరకు నగదు పంపిణీ చేశారని తెలుస్తోంది. కొందరు వలంటీర్లు నగదు పంపిణీకి అంగీకరించకపోవడంతో ఆయా ప్రాంతాల వైసీపీ వర్గీయులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇదంతా గుట్టుచప్పుడు కాకుండా ఓట్ల కోసం వైసీపీ సాగిస్తున్న అక్రమ వ్యవహారమనే చర్చ నగరంలో సాగుతోంది.

- అనంతపురం సిటీ

ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయండి



అనంతపురం టౌన్, మే 10: ఎన్నికలకు సంబంధించి ఎక్కడ ఎలాంటి అక్రమాలు, సంఘటనలు జరిగినా.. సమస్యలు ఏర్పడినా ఫిర్యాదు చేయడానికి జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదులు చేయడానికి టోల్ ఫ్రీ నెంబర్లు కేటాయించారు. 08554-231722, 08554-232922, 08554-231922, 18004258802, 18004258803, 188004258804 ఈ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చు. ఫిర్యాదులపై 100 నిమిషాలలోనే అధికారులు స్పందించి వాటిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటారు.

పరిశీలకులకు కూడా.. ఎన్నికల పరిశీలన కోసం జిల్లాకు కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక పరిశీలకులను పంపించింది. ఎక్కడైనా ఇబ్బందులు, సమస్యలు ఏర్పడితే వీరికి కూడా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. అనంతపురం పార్లమెంటు ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు.. అజయ్‌నాథ్ (8919756419), రవికుమార్ (8247810416), వ్యయ పరిశీలకులు విలాస్ వి.షిండే (9408794122), రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు నితిన్ అగర్వాల్ (8247832873), అనంతపురం, రాప్తాడు, కళ్యాణదుర్గం, శింగనమల నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు రాందాస్ టి.కాలే (8074550860) ఈనెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. సీవిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

ఓటెయ్యాలా.. డ్యూటీ చేయాలా..?



ఎన్నికల వేళ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ప్రథమ చికిత్స కేంద్రంలో విధులు కేటాయించడంతో తామెలా ఓటు హక్కు వినియోగించు కోవాలని పలువురు వైద్యసిబ్బంది ప్రశ్నిస్తున్నా రు. జిల్లాలో 2,236 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రతి కేంద్రానికి ఒక నర్సు, ఒక ఆశా కార్యకర్తను నియమించారు. వీరి పర్యవేక్షణకు డాక్టర్లను ఏర్పాటు చేశారు. ఈలెక్కన దాదాపు ఐదువేల మంది వైద్య సిబ్బంది ఎన్నికల డ్యూటీలో ఉండనున్నారు. ఇప్పుడు ఇదే సమస్యగా మారింది. ఎన్నికల కేంద్రాల వద్ద డ్యూటీ ఉంటే ఓటు మరో చోట ఉన్న వాళ్లు ఎలా ఓటు హక్కు వినియోగించుకుంటారనే చర్చ నడుస్తోంది. గతంలో ఇలా డ్యూటీలకు వెళ్లే వైద్య సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించేవారు. ఈసారి అలాచేయకుండా డ్యూటీలు వేసేయడంతో అయోమయం నెల కొంది. దీనిపై డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ.బీ.దేవిని అడిగితే ఓటు ఎక్కడ ఉంటే అక్కడే వారికి డ్యూటీ వేస్తున్నామని, ఒకవేళ ఓటు మరోచోట ఉన్నా అలాంటి వారిని పంపించి ఓటు వేసి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఇప్పటికే డాక్టర్లకు ఈమేరకు ఆదేశాలు కూడా ఇచ్చినట్లు తెలిపారు.

- అనంతపురం టౌన్

ఐదేళ్లూ.. పస్తులే..!

పట్టెడన్నమూ కరువేనా జగన్ మామయ్యా..?


ఇంటర్ విద్యార్థుల ఆకలి బాధలు

నాడు కడుపు నింపిన చంద్రబాబు

జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు

ఉద్యమించిన నేతలపైనా కేసులు





అనంతపురం విద్య: విద్యార్థులకు మామయ్యను అని చెప్పుకునే జగన్‌రెడ్డి.. ఈ ఐదేళ్లలో ఇంటర్ విద్యార్థులకు నాలుగు మెతుకులు కూడా అందించలేకపోయారు. మీ మామయ్యను అంటూ చెప్పుకుని..పిల్లల తల్లి దండ్రులలో ఓట్లు వేయించుకుని 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్.. ఇంటర్ పిల్లలు కాలే కడుపులతోనే చదువుకునేలా చేశారు. పల్లెల నుంచి పట్టణాల్లోని జూనియర్ కళాశాలలకు ఆకలి కడుపులతో వచ్చి చదువుకుంటున్నారన్న విషయం తెలుసుకున్న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2018, 2019లో ఇంటర్ విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనం అందించారు. వేలాది మంది ఇంటర్ విద్యార్థుల కడుపు నింపారు. 2019లో సీఎం పీఠంపై కూర్చొన్న జగన్.. నిర్ధాక్షిణ్యంగా ఇంటర్ పిల్లల కడుపుపై కొట్టారు.

టీడీపీ హయాంలో మధ్యాహ్న భోజనం

విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా గత ప్రభుత్వం నడిచింది. ముఖ్యంగా ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా భోజనం అందించాలన్న సంకల్పంతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకున్నారు. 2018, 2019 సంవత్సరాల్లో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు. పాఠశాల విద్యార్థులే కాకుండా ఇంటర్ చదువుకునే విద్యార్థులు సైతం కడుపు నిండా భో జనం చేయాలన్న సదుద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 42 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 18,061 మంది విద్యార్థులకు నిత్యం మధ్యాహ్న భోజనం అందించేవారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు స్కూళ్లలో మధ్యాహ్న భోజనం తయా రు చేయించి, జూనియర్ కళాశాలలకు తెప్పించి పిల్లలకు కడుపు నింపారు. పల్లెటూరి నుంచి పట్టణాల్లోని జూనియర్ కళాశాలలకు వచ్చే విద్యార్థులకు ఇది ఎంతో దోహదపడింది.

విద్యార్థుల కడుపు మాడ్చిన మామయ్య

2019లో అధికారంలో వచ్చిన జగన్ ఇంటర్ విద్యార్థులను గాలికి వదిలేశారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం పెడితే..తాను ఎందుకు లన్నట్టుగా వ్యవహరించిన జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని ఆపేశారు. ఇంటర్ విద్యార్థులకు ఏనాడూ భోజనం పెట్టలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 42 జూనియర్ కళాశాలల్లో ఏకంగా లక్ష మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం అందకుండా కోల్పోయారు. పట్టణాలకు వస్తున్న వేలాది మంది ఇంటర్ విద్యార్థులు కాలే కడుపులతోనే చదువుకోవాల్సిన దుస్థితికి తీసుకొచ్చారు. విద్యార్థుల కడుపు మాడ్చవద్దని, మధ్యాహ్న భోజన పథకం ఇంటర్ కళాశాలల్లో సైతం అమలు చేయాలంటూ టీఎన్ఎస్ఎఫ్ ఇతర విద్యార్థి సంఘాల నాయకులు ఉద్యమించారు. విద్యార్థుల తరఫున ఆర్ఐఓ ఆఫీస్ వద్ద పోరాటం చేసిన నేరానికి, విద్యార్థి సంఘాల నాయకులపై అక్రమ కేసులు పెట్టారు. పిల్లలకు భోజనం పెట్టాలని ధర్నా చేశారని అధికార మదంతో సుమారు 12 మందిపై అక్రమ కేసులు కూడా పెట్టించడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఇంటర్ పిల్లల పాలిట కంసమామ

జగన్‌రెడ్డి గత ఎన్నికల్లో విద్యార్థుల పేరు చెప్పుకుని వారి తల్లిదండ్రుల ఓట్లు దండుకున్నాడు. అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం కూడా పెట్టకుండా చేశాడు. మామయ్యను అంటూనే..ఆ విద్యార్థుల పాలిట కంస మామగా మారాడు. ఇంటర్‌లో మధ్యాహ్నభోజనం అమలు చేయాలని విద్యార్థి సంఘాల నేతలుగా ఆందోళనలు చేపడితే మాపై కేసులు కూడా పెట్టాడు. దాదాపు నాలుగేళ్ల కోర్టుల చుట్టూ తిప్పాడు. పేద విద్యార్థుల కడుపు మాడ్చిన జగన్‌కు ఈ ఎన్నికల్లో పతనం తప్పదు.

- బండి పరశురాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీఎన్ఎస్ఎఫ్



ఇంటర్ విద్యార్థుల పొట్టకొట్టారు

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు కోసం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక చర్యలు తీసుకున్నారు. పల్లెల నుంచి వచ్చే విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనం అందించారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ఈ ఐదేళ్లలో విద్యార్థులకు తీరని అన్యాయం చేశారు. లక్షలాది మంది విద్యార్థుల కడుపు మాడ్చారు. కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముకాస్తూ పేద విద్యార్థుల కడుపుకొట్టారు. జగన్ ప్రభుత్వానికి తల్లిదండ్రుల చేతిలో ఓటమి ఖాయం.

- లక్ష్మీ నరసింహ, తెలుగుయువత రాష్ట్ర అధికారి ప్రతినిధి

ఏలికా.. మీ మాట మరువలేం

- చెత్తా చెదారంతో నిండిన మరువవంక



చెత్తతో నిండిన మరువవంక

అనంతపురం సిటీ: నగరంలోని మరువవంకలో చెత్తా చెదారం నిండిపోవడంతో డ్రైనేజీ నీరు ముందుకుసాగడం లేదు. ప్రధానంగా ఐరన్‌బ్రిడ్జి, సూర్యనగర్ వెంబడి ఉన్న మరువవంకలో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు, కుప్పలుగా పడింది. దీంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. వర్షం వచ్చిన సమయంలో మరింత ఇబ్బందికరంగా మారుతోంది. బయటినుంచి డ్రైనేజీ, వర్షపు నీరు సైతం ఆ కాలువలోకి రాకుండా చెత్తచెదారం అడ్డుగా ఉండటంతో మురుగునీరు రోడ్లపైకి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. నిత్యం దుర్వాసన వస్తుండటంతో మరువవంకకాలువ సమీపంలో నివాసం ఉండే ప్రజలు పరిస్థితి దారుణంగా మారింది. గత ఎన్నికల సందర్భంగా నగరంలో అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే గెలిచాక అటువైపు ఆలోచనే చేయడం లేదని నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరువవంక సమీపంలోని ప్రజలను కదిలిస్తే తమను మురుగు దుర్గంధానికి వదిలేసిన నాయకులకు 13న జరిగే ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెబుతామని పేర్కొంటున్నారు.

జగన్ మార్కు అభివృద్ధి ఇదే..!



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

అనంతపురం సెంట్రల్, మే 10: అభివృద్ధి అంటే ఏమిటో తమ ప్రభుత్వాన్ని చూసి నేర్చుకోవాలని సీఎం జగన్ తరచూ చెప్పే మాటలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయి. క్షేత్రస్థాయిలో రోడ్లు సరిగాలేవు. మురుగు కాలువలు అసలే లేవు. దీంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. బళ్లారి బైపాస్ ఎంవైఆర్ కల్యాణమండపం నుంచి నగరం వైపు కిలోమీటరు దూరం వరకు ఏళ్లతరబడి మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. ఆ పరిసర ప్రాంతంలో అనేక రంగాల కార్మికులు, దుకాణాదారులు, వ్యాపారులు ఉన్నారు. ఇది బళ్లారి, హొస్పేట్, హుబ్లీ, గోవాకు ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనదారులు ఈ మురుగును దాటుకుని వెళ్తుంటారు. సంవత్సరాలు గడిచినా కాలువను మరమ్మతు చేయకుండా మురుగును రోడ్డుపై వదిలేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేనా కళ్లముందు కనిపించే అభివృద్ధి జగన్ అంటూ ఎద్దేవా చేస్తున్నారు.

దళితులపై తోపుదుర్తి అరాచకం



దాడిలో గాయపడిన వన్నూరప్ప (ఫైల్)



● దాడులతో భయాందోళన ● బి.యాలేరులో 270 మంది పట్టాల రద్దు

ఆత్మకూరు, మే 10 : వైసీపీ నేతలు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై వివక్ష చూపడమే కాదు.. ఎక్కడ చూసినా దాడులకు పాల్పడుతూ భయాందోళనకు గురి చేస్తున్నారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరులు, అనుచరులు దాడులు చేస్తూ ఆ వర్గాలను భయభ్రాంతులుకు గురిచేస్తున్నారు. ప్రతిపక్షనాయకులపైనే కాకుండా సొంత పార్టీ నాయకులపైనా దాడులు చేశారు. దీంతో టీడీపీలోకి వలసలు జోరందుకున్నాయి.ఆత్మకూరు మండల వ్యాప్తంగా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీలపై పలుమార్లు దాడులకు తెగబడ్డారు. బి.యాలేరు గ్రామంలో పట్టాలు పంపిణీలో దళితులకు అన్యాయం జరిగింది. 2019లో అప్పటి మంత్రి పరిటాల సునీత 270 మందికి ఇంటి పట్టాలు అందజేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దళిత లబ్ధిదారులకు ఎలాంటి నోటీలు ఇవ్వకుండా పట్టాలు రద్దు చేయించారు. దళితులను పక్కన పెట్టి సొంత సామాజిక వర్గంతో పాటు మరికొందరకి పట్టాలు ఇచ్చారు. పట్టాల పంపిణీ సందర్భంగా దళితులను నుంచి నిరసనలు తలెత్తకుండా ముందస్తు అరెస్టులు చేశారు. బి. యాలేరు దళితులు పట్టాలు పంపిణీ చేయాలని కోర్టుకు వెళ్లడంతో పాటు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండా పోయింది.

తోపుదుర్తిలో దళితులపై అరాచకం

తోపుదుర్తి గ్రామంలో దళితులపై ఎమ్మెల్యే సోదరుడు రాజశేఖర రెడ్డి అనుచరులు అరాచకంతో గ్రామంలో భయాందోళనలు కలిగించాయి. గ్రామానికి చెందిన మాల వన్నూరప్పను ఇంటిదగ్గర నుంచి బలవంతంగా ఎమ్మెల్యే ఇంటిదగ్గరకు తీసుకెళ్లి దాడికి పాల్పడ్డారు. ఆ దాడిలో వన్నూరప్పకు వీపుపై తీవ్రగాయాలయ్యాయి. అప్పటి నుంచి దళితులు గ్రామంలో ఎప్పుడు ఏమి జరుగుతోందని ఆందోళనతో బతుకుతున్నారు. తోపుదుర్తి సోదరుల నుంచి తనకు ప్రాణహాని ఉందని జిల్లా పోలీసుకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. తోపుదుర్తిలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది. వడ్డపల్లిలో గడపగడపకు వచ్చిన సమయంలో సొంత పార్టీకి చెందిన దళితులు తమ సమస్యలు పరిష్కరించలేదని నిలదీశారు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే వారిని స్టేషన్ చుట్టే తిప్పారు. ఆత్మకూరు దళిత కాలనీలో వైసీపీ సర్పంచ్ సోదరుడు టీడీపీలో చేరడంతో పార్టీలో ఎలా చేరుతావ్ అంటూ స్థానిక నాయకులు బెదిరించారు.

ఎమ్మెల్యేకు దళితులు అంటే పడదు



రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి మొదటి నుంచి దళితులు అంటే పడదు. అధికారంలోకి వచ్చీరాగానే గ్రామంలో 270 మంది పట్టాలను రద్దు చేసి వారి కడుపుకొట్టాడు. అప్పటి నుంచి మండలంలో చాలామంది దళితులపై వివక్ష చూపుతూ పాలనసాగిస్తున్నాడు. మరోసారి ఎన్నికలు వచ్చినా దళితులపై మాత్రం దాడులు ఆగడం లేదు. దళితులపై దాడులు చేస్తున్న ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకి ఈ ఎన్నికల్లో తప్పకుండా బుద్ధి చెబుతాం.

మొద్దు రామంజి, బి.యాలేరు, ఆత్మకూరు మండలం

ఓటేసికి రాండన్నో..!

వలస ఓటర్లను రప్పించేందుకు పార్టీల యత్నాలు

వివిధ ప్రాంతాల నుంచి ఉత్సాహంగా వస్తున్న ఓటర్లు

బుక్కరాయసముద్రంం, మే 10: స్థానిక సంస్థల ఎన్నికలను తలపించే విధంగా ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. వృత్తి, ఉ పాధి రీత్యా హైదరాబాద్, బెంగళూరు, పూణే , ముంబై తదితర నగరాలకు వలసవెళ్లిన వారందరూ ఓటు వేయడానికి సొంతూళ్లకు వస్తున్నా రు. వరుసగా సెలవులు రావడం కూడా సొం తూరి ప్రయాణానికి వారిలో ఉత్సాహం నింపుతోంది.

ఖర్చు మాదే..!



ప్రస్తుతం ఎన్నికలు హోరాహోరీగా ఉండటంతో ప్రతి ఓటు కీలకంగా మారింది. దీంతో శింగనమల నియోజకవర్గం ఓటర్లు ఏయో ప్రాంతా ల్లో ఉన్నారో.. గుర్తించి వారిని పిలిపిస్తున్నారు. ఎంత ఖర్చైనా మనమే భరిద్దాం అంటూ అభ్యర్థులు తమ కేడర్‌కు సూచిస్తున్నారు. ఓటరు జాబితాలో పేరు ఉండి ఉపాధి రీత్యా వేరే ప్రాం తాలకు వెళ్లిన వారిని ఎక్కడున్నా సరే పిలిపించి ఓటు వేయించేందుకు ఆయా పార్టీల నాయకులు సిద్ధమయ్యారు. ఐటీ సహా ఇతర ఉద్యోగాల కోసం వెళ్లిన ప్రతి ఒక్కరికి ఫోన్లు చేసి మాట్లాడుతున్నారు.

బస్సు, ట్రైన్‌లు కిటకిట

ప్రధానంగా హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, మహారాష్ట్ర తదితర ప్రాంతాలలో నుంచి రావాలంటే బస్సులు, ట్రైన్‌లు కిటకిట లాడుతున్నాయి. ఈనెల 13న పోలింగ్ జరుగుతుండటంతో పాటు మూడు రోజుల సెలవులు రావడంతో సొంత గ్రామాలకు రావడానికి పెద్ద సంఖ్యలో ఓటర్లు గ్రామాల బాట పడుతున్నారు. ప్రైవేటు, ఆర్టీసీ, రైలులో టికెట్లు ఇప్పటి ఫుల్ కావడంతో వచ్చేందుకు వలస ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారు. టిక్కెట్లు ఖర్చు ఇస్తాము.. కానీ బుక్ చేయలేమని పార్టీ కేడర్ వారికి చెబుతోంది. గ్రామంలో నలుగురైదుగురు ఉంటే కారు సిద్ధం చేసుకోండి ఖర్చు భరిస్తామని పార్టీ నేతల ఆఫర్ ఇస్తున్నారు. శింగనమల నియోజకవర్గంలో వలస ఓటర్లు దాదాపు 2500 మందిపైగా ఉన్నట్లు తెలిసింది.

విత్తన పంపిణీపై.. జగన్ సర్కార్ నిర్లక్ష్యం

గత ఏడాది మే 5కే సబ్సిడీ ధరల ఖరారు

ఈసారి మార్చిలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఇప్పటి దాకా అతీగతీలేని వైనం

ఎన్నికల కమిషన్ అనుమతిలోనూ అశ్రద్ధేనా..?

పోలింగ్ తర్వాతనైనా మొదలు పెడతారా...?

ప్రభుత్వం తీరుపై రైతుల ఆగ్రహం



అనంతపురం అర్బన్, మే 10 : కరువు రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ, ఇతర రకాల విత్తనాల పంపిణీపై జగన్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ ఏడాది మార్చి మొదటి వారంలోనే జిల్లాకు అవసరమయ్యే విత్తన వేరుశనగ, ఇతర రకాల అంతర పంటల విత్తనాల మోతాదుపై జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. రెండు మాసాలు గడుస్తున్నా ఇప్పటి దాకా అతీగతీ లేకుండా పోయింది. సార్వత్రిక ఎన్నికల సమయం కావడంతో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ప్రతి ఏడాది రెగ్యులర్‌గా జరిగే విత్తన పంపిణీపై ఎన్నికల కమిషన్ నుంచి అనుమతులు తీసుకొని ప్రక్రియను మొదలు పెట్టడంపై ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. ఇందుకు మరో మూడు వారాలే సమయం ఉంది. ఇప్పటి దాకా జిల్లాకు విత్తన కేటాయింపులు చేయకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం తరఫున వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు మినహాయింపు కోసం లేఖ రాశారో..? లేదో తెలియని దుస్థితి నెలకొంది. పోలింగ్ తర్వాతయినా రాష్ట్ర ఉన్నతాధికారులు దీనిపై కదులుతారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సబ్సిడీ విత్తన కాయల పంపిణీ ఆలస్యంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మార్చిలోనే ప్రతిపాదనలు

ఈ ఏడాది మార్చిలోనే ఖరీఫ్ సీజన్‌లో విత్తన వేశనగతోపాటు ఇతర రకాల విత్తనాల కేటాయింపులకు సంబంధించి ప్రతిపాదనలు పంపారు. ఈసారి జిల్లాకు వేరుశనగ 1.25 లక్షల క్వింటాళ్లు, కంది 2,500 క్వింటాళ్లు, గ్రీన్ పచ్చిరొట్టె ఎరువులు 600, కొర్ర 100, పెసలు 100, అలసందలు 150, రాగి 50 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి దాకా జిల్లాకు విత్తనాలు కేటాయించి, సంబంధించిన గైడ్‌లైన్స్‌ను జారీ చేయడంలో జగన్ సర్కార్ తీవ్ర జాప్యం చేస్తూ వచ్చింది. రెండు మాసాల క్రితమే ప్రతిపాదనలు పంపినా ఇప్పటి దాకా అతీగతీ లేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

గత ఏడాది మేలోనే ప్రారంభం

గత ఏడాది మే మొదటి వారంలోగానే విత్తన వేరుశనగతోపాటు ఇతర రకాల విత్తనాల సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. గత ఏడాది మే 16 నుంచి ఆర్బీకేల్లో రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ మొదలు పెట్టారు. మే 29 నుంచి విత్తన పంపిణీ ప్రారంభించారు. ఈసారి ఇప్పటి దాకా విత్తన పంపిణీకి సంబంధించిన ఎలాంటి విధివిధానాలు జారీ కాలేదు. మరోవైపు విత్తన వేరుశనగ, ఇతర రకాల విత్తనాల ప్రాసెసింగ్ ప్రక్రియ జరగలేదు.

విత్తన పంపిణీలో జాప్యం దారుణం



కరువు రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ, ఇతర రకాల విత్తనాల పంపిణీపై ప్రభుత్వం జాప్యం చేయడం దారుణం. ఈ ఏడాది మార్చి మొదటి వారంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా మిన్నకుండిపోవడంలో అంతర్యమేమిటో అర్థం కావడం లేదు. రైతులను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చి, ఓట్లు వేయించుకొని, అధికారంలోకి రాగానే పూర్తిగా విస్మరించారు. ఈ ఏడాది సబ్సిడీ విత్తన కాయల పంపిణీపై తీవ్ర అశ్రద్ధ వహించడం అన్యాయం. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని సకాలంలో విత్తన కాయలు పంపిణీ చేయాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

రైతుల జీవితాలతో చెలగాటం



కరువు రైతుల జీవితాలతో జగన్ సర్కార్ చెలగాటమాడుతోంది. జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో వేరుశనగతోపాటు కంది, ఇతర రకాల పంటలు సాగవుతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి సీజన్‌లో సబ్సిడీ విత్తన కాయలు అందజేయడంలో జాప్యం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని రైతులకు సకాలంలో విత్తన పంపిణీ జరిగేలా చొరవ చూపడంలో జగన్ సర్కార్ ఘోరంగా విఫలమైంది. ఐదేళ్లుగా సబ్సిడీ పథకాలు అమలు చేయకుండా రైతులకు అన్యాయం చేసిన జగన్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు రైతులంతా సిద్ధంగా ఉన్నారు.

- బొల్లు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, తెలుగు రైతు విభాగం

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

జిడ్డు కృష్ణమూర్తి (జయంతి)




జిడ్డు కృష్ణమూర్తి 1895 మే 11న చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించారు. 1929 నుంచి మరణించేంతవరకు ప్రపంచ వ్యాప్తంగా పర్యటిస్తూ తాత్విక, ఆధ్యాత్మిక అంశాలపై అనేక ప్రసంగాలు చేశారు. ఆయన బోధించిన తత్వం ఏ నిర్ణీత తాత్వికచట్రంలో ఇమడదు. దాని ప్రత్యేకత దానిదే. మానసిక విప్లవం, మనోభావ విచారణ, ధ్యానం, మానవ సంబంధాలు, సమాజంలో మౌలిక మార్పు, మనిషి తనంతట తానుగా భయం, కట్టుబాట్లు, అధికారం, మూఢవిశ్వాసాలనుంచి విముక్తి చెందాలని బోధించారు. తాను గురువును, ప్రవక్తను కాదని ప్రకటించుకున్నారు. 1986 ఫిబ్రవరి 17న కన్నుమూశారు.

మాధవపెద్ది సత్యం (జయంతి)



మాధవపెద్ది సత్యం 1922 మే 11న బాపట్లలో జన్మించారు. తెలుగు సినిమా నేపథ్య గాయకుడు, రంగస్థల నటుడు. తెలుగు, తమిళం, కన్నడ, మళయాళం, హిందీ, సింహళభాషలు సహా దాదాపు అన్ని భారతీయ భాషలలో 7వేలకుపైగా పాటలు పాడి పేరొందారు. 8ఏళ్లకే నాటకాలలో నటించారు. తొలిసారిగా వెండి తెరపై హిందీ, తమిళ ద్విభాషా చిత్రం 'రామదాసు'లో కనిపించారు. 'షావుకారు' తో తెలుగు సినీరంగంలోకి ప్రవేశించారు. ప్రత్యేకించి పౌరాణిక సినిమాలలో పద్యాలు పాడడంలో పేరొందారు. 'అయ్యయో జేబులో డబ్బులు పోయెనే, 'వివాహ భోజనంబు వింతైన వంటకంబు' వంటి పాటలు పాపులర్. 75వ యేట 1997లో 'సింధూరం' సినిమాలో 'సంకురాతిరి పండుగ వచ్చెరో' పాటపాడి ప్రశంసలు అందుకున్నారు. 2000 డిసెంబరు 18న కన్నుమూశారు.

డాక్టర్ సామల సదాశివ (జయంతి)



డాక్టర్ సామల సదాశివ 1928 మే 11న (అప్పటి ఆదిలాబాద్) ప్రస్తుత కొమరం భీం జిల్లా దహేగావ్ మండలం తెనుగుపల్లెలో జన్మించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత. తెలుగు, ఉర్దూ రచయిత. హిందూస్తానీ సంగీత పండితుడు. ఉపాధ్యాయుడు. హిందూస్తానీ సంగీతాన్ని తొలిసారిగా తెలుగు పాఠక లోకానికి పరిచయం చేసిన తొలి తెలుగు రచయిత. సంస్కృత, ఉర్దూ, పర్షియన్, మరాఠీ, హిందీ, ఆంగ్ల, తెలుగు భాషలలో రాణించారు. 425కుపైగా రచనలు చేశారు. ఉర్దూ పత్రిక సియాసత్‌లో అనేక ఏళ్లపాటు ఆయన వ్యాసాలు ప్రచురించబడ్డాయి. మలయ మారుతాలు, సంగీత శిఖరాలు వంటి రచనలు పేరొందాయి. 2012 ఆగస్టు 7న కన్నుమూశారు.

98 భాషల్లో 'హనుమాన్'



సరికొత్త వెబ్ ప్లాట్‌ఫాం ఆవిష్కరణ

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): దేశీయ పరిజ్ఞానంతో జెన్ ఏఐ ప్లాట్‌ఫాం హనుమాన్ 98భాషల్లో లైవ్ ఇవ్వనుందని ఎస్ఎంఎల్ ఇండియా కో-ఫౌండర్ సీఈఓ డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు. బెంగళూరులో హనుమాన్ జెన్ ఏఐను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. రాముడిబంటు హనుమాన్ పేరిట జెన్ ఏఐ టెక్నాలజీని ఆరంభించామన్నారు. బెంగళూరుకు చెందిన ఎస్ఎంఎల్ ఇండియా, దుబాయ్‌కు చెందిన 3ఏఐ హోల్డింగ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం 12 భారతీయ భాషలతోపాటు 98 భాషల్లో లభ్యమన్నారు. ఎస్ఎంఎల్ ఇండియా సంస్థ, హెచ్‌పి, నాస్కామ్, యోట్టా, తెలంగాణ ప్రభుత్వంతోపాటు బీపీఆర్‌పీజీ లాంటి టెక్ మేజర్ కంపెనీలతో భాగస్వామ్యం కలిగి ఉన్నామన్నారు. ఇదో క్రియాత్మకమైన బహుభాషా వెబ్‌ప్లాట్‌ఫాం అన్నారు. అప్లికేషన్‌ను ఆండ్రాయిడ్ వినియోగదారులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. 12 భారతీయ భాషల్లో హిందీ, గుజరాతీ, మరాఠీ, తెలుగు, కన్నడతోపాటు విదేశీ భాషల్లో ఇంగ్లిష్, స్పానిష్, జర్మన్, ఇటాలియన్, కొరియన్ ఇతరత్రా ఉన్నాయన్నారు. ఏడాదిలో 200 మిలియన్‌లమంది యూజర్స్ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ద్విచక్రవాహనం, లారీ ఢీ ఒకరి మృతి

బంగారపేట, మే 10: తాలూకాలోని ఎళెసంద్ర వద్ద ద్విచక్ర వాహనం, లారీ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. మధు (25)గా గుర్తించారు. తాలూకాలోని గుల్లహళ్ళి గ్రామానికి చెందిన మధు రోడ్డు ప్రమాదంలో ఘటనా స్థలం లోనే మృత్యువాత పడ్డాడు. కామసముద్ర నుంచి బూదికోటెవైపు వస్తున్న లారీ, ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. కాగా ప్రమాదం అనంతరం లారీ సహా డ్రైవర్ పరారయ్యాడు. బూదికోటె పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నగదు పట్టివేత

కుందుర్పి, మే 10: కుందుర్పి ఎస్ఐ వెంకటస్వామి విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం వాహనాల తనిఖీలు చేస్తుండగా కారులో రూ.కోటి నగదు దొరకడంతో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం తెలిపారు. ఆ డబ్బుకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించగా అన్ని సరిగా ఉన్నందున ఎఫ్ఎస్‌టీ సిబ్బందికి ఆర్‌వో ఆదేశాల మేరకు నగదు రిలీజ్ చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గంరూరల్, మే 10: గుమ్మఘట్ట మండలం బేలోడు గ్రామానికి చెందిన మల్లికార్జున కర్ణాటకలోని తిమ్మలాపురం గ్రామానికి చెందిన అంజినేయ అనే వ్యక్తులు కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ మురళీమోహన్ శుక్రవారం తెలిపారు. రెండు బాక్సులు కర్ణాటక మద్యాన్ని, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి ఇద్దరుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమసమాజం బసవణ్ణ ఆశయం

- బేలి మఠం స్వామీజీ
- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా బసవజయంతి



బసవజయంతిలో బేలి మఠం శివరుద్రస్వామీజీ తదితరులు

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అందరూ సమానమని వ్యత్యాసాలు బేధభావాలు లేకుండా అందరిని కలుపుకుపోయే ఆశయం కోసం బసవణ్ణ పాటుపడ్డారని బేలి మఠాధిపతి శివరుద్రస్వామీజీ అభిప్రాయపడ్డారు. విశ్వమానవుడిగా పేరొందిన బసవణ్ణ జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకున్నారు. నగరంలో వచనజ్యోతి బళగ ఏర్పాటు చేసిన జయంతి వేడుకలను శుక్రవారం ఎమ్మెల్యే కృష్ణప్ప లాంఛనంగా ఆరంభించారు. ఇదే సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 12వ శతాబ్దంలోనే బసవణ్ణ పాటించిన ఆశయాలు నేటి సమాజానికి అవసరమనిపించేలా ఉన్నాయన్నారు. శివరుద్రస్వామీజీ మాట్లాడుతూ బసవ జయంతి రోజున మాత్రమే ఊరేగింపు జరుపడం కాదని నిత్యం బసవతత్వాలతో కలిసి జీవనం సాగించాలని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ తెల్లవారునే బసవణ్ణ తత్వాలతో వేడుకలు ఆరంభించి సాంస్కృతిక నాయకత్వానికి అనుగుణంగానే సంప్రదాయ నృత్యాలతో ఊరేగింపు జరుపడం సంతోషమన్నారు. వచనజ్యోతి బళగ అధ్యక్షులు పినాక పాణి పర్యవేక్షణలో జరిగిన సంబరాలలో విద్వాంసులు డాక్టర్ సియు మంజునాథ్, డాక్టర్ మునిరాజప్ప, గురుప్రసాద్ కుచ్చంగి, ఆర్‌జిహళ్ళి నాగరాజ్, కేఆర్ సౌమ్యా, కన్నడ అధ్యాపకులు రుద్రేష్ అదరంగి సహా వచన జ్యోతి బళగ సభ్యులు పాల్గొన్నారు.

విజయపురలో...

విజయపుర: విశ్వగురు బసవణ్ణ 891వ జయంతి అర్థవంతంగా ఆచరించారు. 12వ శతాబ్దంలోనే సమాజంలో చైతన్యం కోసం పాటుపడిన బసవణ్ణ ఆదర్శాలు, వచనాలు నేటికీ అనుసరణీయమని జాతీయ బసవదళ కార్యదర్శి వీ శివణ్ణ అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని గాంధీచౌక్‌లో నగర్త యువజన సంఘం, నగరేశ్వర సేవా సమితి ట్రస్టు, జాతీయ బసవదళ సం యుక్తంగా శుక్రవారం బసవజయంతి నిర్వహించాయి. పతా కాన్ని ఎగురవేశారు. అక్క బళగ సీనియర్ సభ్యురాలు సౌభాగ్యమ్మ శివరుద్రప్ప మాట్లాడుతూ బసవణ్ణ వచనాలు జీవితానికి మార్గదర్శకాలన్నారు. రిటైర్డు కమిషనర్ శివకుమార్ మాట్లాడుతూ దాసోహ తత్వాన్ని అలవరచిన ఘనత బసవణ్ణకే చెల్లుతుం దన్నారు. మానవత్వం చాటుకోవడం ద్వారా మానవ జీవితాన్ని సార్థకం చేసుకోవాలని ప్రబోధిం చారన్నారు. కార్యక్రమంలో నగర్త యువజన సంఘం అధ్యక్షుడు బేకరి మంజు నాథ్, అయోధ్యానగర శివాచార నగర్త యువజన సంఘం అధ్యక్షుడు ఏ మంజునాథ్, గౌరవాధ్యక్షుడు మురళీధర్, జాతీయ బసవ దళ అధ్యక్షుడు పుట్ట రాజణ్ణ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పుర వీధులలో బసవణ్ణ, శివ కుమార స్వామిజీ, అక్క మహాదేవి చిత్రపటాలతో నగర సంకీర్తన, వచన గాయనం చేశారు.



విజయపురలో నగరసంకీర్తన చేస్తూ



బంగారపేట తాలూకా కార్యాలయంలో...

పురసభ ఆధ్వర్యంలో...

పట్టణంలోని పురసభ ఆవ రణలోనూ బసవజయంతి అర్థవంతంగా ఆచరించారు. పురసభ ఆరోగ్య అధికారి లావణ్య నేతృత్వం వహించారు. బసవణ్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారపేటలో...

బంగారపేట : పన్నెండో శతాబ్ధంలో సామాజిక, ధార్మిక చైతన్యం కోసం పాటుపడి సమాజంలోని కులవ్యవస్థ తీరును ఎండగడుతూ పరస్పర ప్రేమ అభిమానాలు పెంపొందేలా వచనాలతో స్ఫూర్తి కలిగించిన మహనీయులు బసవణ్ణ అని బీఈఓ సుకన్యా అభిప్రాయపడ్డారు. పట్టణంలోని తాలూకా పాలనాభవనంలో శుక్రవారం ఏర్పాటైన బసవణ్ణ, హేమరెడ్డి మల్లమ్మ జయంతిలో పాల్గొని మాట్లాడారు. 1131 సంవత్సరంలో బిజాపుర జిల్లా బాగేవాడి అనే అగ్రహార ప్రాంతంలో బసవణ్ణ జన్మించారన్నారు. తల్లిదండ్రులు బిడ్డకు జాతకర్మను చేయించి బసవణ్ణగా నామకరణ చేయించారన్నారు. బాల్యంనుంచే శివభక్తులుగా ఎదిగారన్నారు. మానవత్వాన్ని చాటి దేవుడి కృపతో గొప్ప గుణాలు అలవరచుకున్నారన్నారు. ఆయన సాధనలు అద్భుతమన్నారు. సమాజంలో సమానత్వం కోసం పాటుపడ్డారన్నారు. 5వేల వచనాలు రచించడం ద్వారా కన్నడ సాహిత్యానికి ఎనలేని సేవలందించారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రశ్మి, వ్యవసాయశాఖ సహాయక డైరెక్టర్ శివారెడ్డి, పురసభ ఆరోగ్య అధికారి గోవిందరాజు, స్థానిక సామాజిక ప్రముఖుడు రవి, ఆర్ఐ అజయ్, కార్యదర్శి చేతన్, ఉప తహసీల్దారు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



విధానసౌధ వద్ద బసవణ్ణ చిత్రపటానికి డీసీఎం, సభాపతి నివాళి



గోవిందరాజనగరలో బసవణ్ణ విగ్రహానికి నివాళి



ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో...

సాయిగోల్డ్‌లో అయోధ్య బాలరాముడి విగ్రహాలకు పూజలు

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): సాయిగోల్డ్ ప్యాలెస్‌లో అక్షయ తృతీయను పురస్కరించుకుని అయోధ్య మందిరంలో పూజలు చేసిన బాల రాముడి విగ్రహాలకు ప్రత్యేకంగా పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ప్యాలెస్ యజమాని, ఎమ్మెల్యే శరవణ మాట్లాడుతూ అయోధ్య ఆలయంలో రాముడి సన్నిధానంలో పూజలు జరిపించిన వెండి బాల రాముడి విగ్రహాలను తీసుకొచ్చామన్నారు. అక్షయ తృతీయ సందర్భంగా 50వేల విలువైన ఆభరణాలు కొనుగోలు చేసిన వారికి ఉచితంగా రాముడి విగ్రహాన్ని అందిస్తున్నామన్నారు. సాయిగోల్డ్ రాయబారి, బిగ్‌బాస్ ఫేం నమ్రతాగౌడ, బుల్లితెర నటి పూర్ణిమలు పాల్గొన్నారు.



సాయిగోల్డ్ ప్యాలెస్‌లో నగల విక్రయాలు

కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్.. బెంగళూరులో సంబరాలు



ఆప్ కార్యకర్తల సంబరాలు

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు కావడంతో బెంగళూరు ఆప్ కార్యాలయంలో కార్యకర్తలు నాయకులు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కార్యాలయంలో ఆప్ రాష్ట్ర కార్యదర్శి మోహన్ దాసరి, డాక్టర్ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచుకున్నారు. కేజ్రీవాల్ కటౌట్‌లకు స్వీట్లు పెట్టి కేరింతలు కొట్టారు. బాణాసంచా కాల్చారు.

యువ న్యాయవాదులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి



చాన్స్‌లర్ డాక్టర్ ఎంఆర్ జయరాం తదితరులు

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): యువ న్యాయవాదులు కొత్త క్రిమినల్ చట్టాల గురించి అవగాహన పొందాలని నేషనల్ లా స్కూల్ అధ్యాపకుడు డాక్టర్ ఎస్‌వీ జోగరావు అభిప్రాయపడ్డారు. రామయ్య లా కళాశాలలో క్రిమినల్ చట్టాలు-మార్పులు అనే అంశంపై మూడు రోజుల జాతీయస్థాయి చర్చాగోష్టి జరిగింది. కళాశాల ముఖ్యులు డాక్టర్ అరుణ్ ఎల్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమానికి చాన్స్‌లర్ డాక్టర్ ఎంఆర్ జయరాం అధ్యక్షత వహించారు. వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఆర్ గోవింద్ కడంబితోపాటు మాజీ ఐపీఎస్ అశిత్‌మోహన్ ప్రసాద్, మాజీ న్యాయమూర్తి ఎస్‌బీఎన్ ప్రకాశ్‌లు పాల్గొన్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి సి.ఎం.జోషి మాట్లాడుతూ న్యాయవాద వృత్తి పవిత్రమైనదన్నారు. సమాజంలో చట్టం, న్యాయం అందరికీ సమానమనే సందేశం యువ న్యాయవాదులు ఇవ్వాలన్నారు. లా కోర్సు చేస్తున్నవారు వృత్తిలో రాణించేందుకు నిరంతరంగా చట్టాలు, తీర్పుల గురించి తెలుసుకోవాలన్నారు. సదస్సులో లా కోర్సు విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణపై అవగాహన



దుకాణదారులకు చైతన్య ఫ్లకార్డులు అందజేత

శిడ్లఘట్ట, మే 10: పట్టణ, తాలూకా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయకుండా అవగాహన కల్పించేలా తాలూకా ఆరోగ్య అధికారి వెంకటేశ్‌మూర్తి నేతృత్వంలో జాగృతి నిర్వహించారు. పట్టణంలో ఆయన నేతృత్వంలో పొగాకు నియంత్రణకు సంబంధించి అధికారుల బృందం పలు చోట్ల కార్యాచరణ నిర్వహించారు. 2003 పొగాకు నియంత్రణ చట్టానికి అనుగుణంగా బహిరంగ స్థలాల్లో ధూమపానం చేయ రాదన్నారు. పాఠశాల, కళాశాలలకు 100మీటర్లలోపు పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నిబంధనలు అతిక్రమించిన దుకాణాలు, బేకరీ, హోటళ్లపై 20 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. కార్యాచరణలో తాలూకా ఆరోగ్య అధికారి ఎంఎస్ దేవరాజ్, జిల్లా పొగాకు నియంత్రణ విభాగం రాఘవేంద్ర, మంజునాథ్, ఆరోగ్యశాఖ అధికారులు సునిల్, కీర్తి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎల్‌సీలో రాణించిన మ్యాక్స్‌ముల్లర్

బెంగళూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో నగరంలోని మహాలక్ష్మి లేఅవుట్‌కు చెందిన మ్యాక్స్‌ముల్లర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రాణించారు. ప్రిన్సిపాల్ హరి మీడియాతో మాట్లాడుతూ 15మంది డిస్టింక్షన్‌లోనూ, ఆరుగురు ఫస్ట్‌క్లాస్‌లోనూ, 30మంది సెకండ్‌క్లాస్‌లోనూ, మరికొంతమంది థర్డ్‌క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించారన్నారు. ధృతి పూజారి 610 మార్కులు, సంపద భట్ 160, రోహిణి ఉమేశ్ శెట్టి 594, చిన్మయిగౌడ 589, రుదున్ పాండియన్ 587, నిపుణ్య వినోద్ 586, సమర్థ్ సింహ 586, ఎన్ ఫ్లిసియా 582 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.



డిస్టింక్షన్ సాధించిన ప్రతిభావంత విద్యార్థులు

చౌడేశ్వరి ఆలయంలో విశేష పూజలు

చేళూరు, మే 10: సరిహద్దులోని అమడగూరు గ్రామం చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. అమావాస్య, పౌర్ణమి రోజుల్లోనూ, మంగళ, శుక్రవారాలలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తుంటారు. బెంగళూరు రామనగర ప్రాంతానికి చెందిన వెంకటస్వామి, తిమ్మయ్య కుటుంబ సభ్యులు 25మంది అమ్మవారిని గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాతల కాలంనుంచి అమ్మవారి దర్శనానికి వస్తున్నట్టు తెలిపారు. అమ్మవారి దయతో పిల్లల వివాహాలు, వారికి సంతానం కలిగిందన్నారు. అంతేకాకుండా పోలీసు ఉద్యోగాలలో స్థిరపడ్డారని తిమ్మయ్య తెలిపారు. కాగా ఈసారి అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరికి తీసుకెళ్లి ఇంట్లో పూజలు, భజనలు చేయించే ఆలోచన ఉందన్నారు. ఇలా చౌడేశ్వరి దేవి ఆలయానికి స్థానికులకంటే దూర ప్రాంతాల భక్తులు తరచూ వచ్చి దర్శనం చేసుకుంటూ ఉంటారు.



చౌడేశ్వరీదేవికి అలంకరణ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఎస్ఎస్ఎల్‌సీలో 79.19 శాతం ఉత్తీర్ణత




బీఈఓ నరేంద్రకుమార్

శిడ్లఘట్ట, మే 10: ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో శిడ్లఘట్ట తాలూకాలో 79.19శాతం ఉత్తీర్ణత సాధ్యమైంది. పట్టణంలో శుక్రవారం బీఈఓ నరేంద్ర కుమార్ మీడియాతో మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా 2509 మంది పరీక్షలకు నమోదు చేసుకోగా.. 1987 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. 1242 మంది బాలురు హాజరు కాగా 896మంది పాస్ అయ్యారని 1267మంది బాలికలకు గాను 1091మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఈసారి కూడా గ్రామీణ ప్రాంత విద్యార్థులు సత్తా చాటారన్నారు. గ్రామీణ ప్రాంతాలలో 1932మంది పరీక్షలకు హాజరు కాగా 1548మంది పాస్ అయ్యారని 80.12శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. ఇక కన్నడ మీడియంలో 1221మంది హాజరు కాగా 727మంది ఉత్తీర్ణులై 67.52శాతం ఉత్తీర్ణత సాధ్యమైందన్నారు. ఇక ఆంగ్ల మీడియంలో 1365మందికిగాను 1220 మంది పాస్ కావడంతో 89.37శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో 769మందికిగా 486మంది పాస్ అయి 63.19 శాతం ఉత్తీర్ణత సాధ్యమైందన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో 442 మందికిగాను 320మంది పాస్ కావడంతో 72.39 ఉత్తీర్ణత నమోదైందన్నారు. అన్‌ఎయిడెడ్ పాఠశాలలనుంచి 1,110మంది పరీక్షలు రాయగా 986మంది పాస్ అయ్యారని వివరించారు. ఇక రెసిడెన్షియల్ స్కూళ్ళలో 198మందికిగా 195మంది పాస్ కావడంతో 98.45 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. అత్యధిక మార్కులు సాధించిన బిజీఎస్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన బేబి ఎన్, సుముఖ ఇంగ్లిష్‌మీడియం హైస్కూల్ విద్యార్థిని దివ్యశ్రీ 625కుగాను 616 మార్కులతో 98.56శాతం ఉత్తీర్ణత సాధించి తాలూకాకు పేరు తెచ్చారన్నారు. ఇక సింధు ఎన్ 615, హర్షిణి 604, అలాగే శివ, అర్జున్, పి బిందులు తలా 610 మార్కులు సాధించారన్నారు.

మొరార్జీ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత

బాగేపల్లి, మే 10: ప్రభుత్వ పాఠశాలలంటే చిన్నచూపు చూస్తున్న తరుణంలో ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో తాలూకాలోని మొరార్జీదేశాయ్ వసతి ఉన్నత పాఠశాల వరుసగా వందశాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణంగా ఉంది. తాలూకాలోని పూలవారపల్లి సమీపాన మొరార్జీదేశాయ్ వసతి హైస్కూల్ ఉంది. గురువారం ప్రకటించిన ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో 46మంది విద్యార్థులకు అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఐదుగురు డిస్టింక్షన్, 31 ఫస్ట్‌క్లాస్, 10మంది సెకండ్‌క్లాస్‌లో ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపాల్ భాగ్యమ్మ తెలిపారు. భార్గవ్ 568 మార్కులతో 90.88శాతం ఉత్తీర్ణతతో పాఠశాల టాపర్‌గా నిలిచారన్నారు. అలాగే మౌనిక బీఎం 561 మార్కులతో ద్వితీయస్థానంలోనూ, 556 మార్కులతో అశోక్ తృతీయస్థానంలో నిలిచినట్టు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరినీ పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు. కాగా పాతపాళ్య నివాసి సురేంద్ర, హేమలతాల కుమార్తె పట్టణంలోని యంగ్ ఇండియా స్కూల్ విద్యార్థిని లక్ష్మీ లిశా ఎస్ 620 మార్కులతో రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు సాధించింది. కన్నడలో 123, ఇంగ్లిష్‌లో 100, హిందీలో 100, గణితంలో 99, సమాజ విజ్ఞానం 100, సైన్స్‌లో 98 మొత్తం 620 మార్కులు సాధించారు. కాగా 623 మార్కులతో మౌనిష్ మూడో ర్యాంకు సాధించిన సంగతి విదితమే. ఇలా తాలూకా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించడంపై హర్షం వ్యక్తం అవుతోంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.69	1,576.01
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	1272
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	138	113
సామర్థ్యం (టీఎంసీలు)	3.45	2.83

ఘనంగా బసవేశ్వర జయంతి



బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాల వేస్తున్న డీసీ

బళ్లారి సిటీ, మే 10: జిల్లా కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బసవేశ్వర జయంతి, శివశరణ హేమారెడ్డి మల్లమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. నగరంలోని హెచ్‌ఆర్ గవియప్ప సర్కిల్(మోతి సర్కిల్) సమీపంలోని బసవేశ్వరుని విగ్రహానికి జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే నగరంలోని కల్చరల్ కాంప్లెక్స్ హాల్లో కూడా శుక్రవారం శివశరణ హేమారెడ్డి మల్లమ్మ చిత్రపటానికి నివాళులర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, జిల్లాపంచాయితీ సీఈఓ రాహుల్‌శరణప్ప, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

బసవన్న ఆదర్శ సిద్ధాంతాలను పాటించాలి



తహసీల్దార్ కార్యాలయంలో బసవ జయంతి దృశ్యం

సిరుగుప్ప, మే 10: బసవన్న ఆదర్శతత్వ సిద్ధాంతాలను పాటించాలని తహసీల్దార్ షంషాలం పిలుపునిచ్చారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణంలో తహసీల్దార్ కార్యాలయంలో బసవేశ్వర భావచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్జీవో అధ్యక్షులు సింగరాజరెడ్డి, రెవెన్యూ అధికారులు, విలేజ్ అకౌంటెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ షంషాలం మాట్లాడుతూ బసవన్న 12వ శతాబ్దంలో అన్ని వర్గాలు సరిసమానంగా ముందుకు రావాలనే ఉద్దేశంతో ఎన్నో పోరాటాలు చేశారని ఆయన తెలిపారు. ఆయన తత్వ సిద్ధాంతాలను పాటించడం వలన మనుషులు ముందడుగు బాటలో నడిచేందుకు సాధ్యపడుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్జీవో అధ్యక్షులు సింగరాజరెడ్డి, రెవెన్యూ అధికారులు, విలేజ్ అకౌంటెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బసవ జ్యోతికి ఘన స్వాగతం



బసవజ్యోతికి స్వాగతం పలుకుతున్న ప్రముఖులు

బళ్లారి సిటీ, మే 10: బసవేశ్వర జయంతిలో భాగంగా దరూరు శాంతనగౌడ ఆయన బృందం కూడల సంగమం నుంచి తీసుకొచ్చిన బసవజ్యోతికి శుక్రవారం బళ్లారి బసవదళం సభాంగణం దగ్గర బగర్ హుకుం సాగు క్రమబద్ధీకరణ కమిటీ అధ్యక్షుడు హెచ్. తిమ్మన్న స్వాగతం పలికారు. ఈసందర్భంగా నగర జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అల్లం ప్రశాంత్, వీరశైవ విద్యావర్ధక సంఘం కార్యవర్గ సభ్యులు యాల్పి మేటి పంపనగౌడ, సాహుకార్ సతీశ్‌బాబు, సంఘం నాయకులు మేటి దివాకర గౌడ, గేనాల్ నాగభూషణగౌడ తదితరులు పాల్గొన్నారు.

తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ తాయమ్మ దేవి

సిరుగుప్ప, మే 10 : పట్టణంలో వెలసిన శ్రీ తాయమ్మ దేవికి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మదేవికి ప్రధాన అర్చకులు శ్రీనివాస ధూప దీప నైవేద్యాలతో పూజలు చేశారు. ఆకు పూజ నిర్వహించారు. ప్రసాద పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.

అకాలవర్షంతో అస్తవ్యస్తం



● అరటిపంటకు రూ.75 లక్షలకు పైగా నష్టం జరిగినట్టు అంచనా

బళ్లారి గాంధీనగర్, మే 10: విజయనగరం జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పంటలన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. సుమారు 120 ఎకరాలలో అరటి పంటకు నష్టం వాటిల్లినట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు అంచనా వేశారు.



దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గవియప్ప

హొసపేట తాలూకా బుక్కసాగర గ్రామానికి చెందిన హనుమంతప్ప, జె.ఎన్.కాళిదాసు తదితర వందమంది రైతులకు చెందిన అరటిపంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. కట్టిరాంపుర, వెంకటాపుర, కమలాపురంలలో కూడా పంటకు కొంతమేర నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు రూ.75లక్షల మేరకు పంట నష్టం జరిగినట్లు ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిదానంద తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు చేపడతామన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

కంప్లి, మే 10 : అకాల వర్షాలకు, గాలులకు నష్టపోయిన రైతన్నలను ఆదుకుంటామని హొస్పేట నియోజకవర్గ ఎమ్మెల్యే గవియప్ప తెలిపారు. శుక్రవారం బుక్కసాగర గ్రామ పరిధిలో నష్టపోయిన రైతుల అరటితోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తోటగారి శాఖ, గ్రామలెక్క అధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించి నివేదికను కూడా తయారు చేశారన్నారు. నష్టపోయిన పంటలను పరిశీలించి వారికి త్వరలోనే వారి బ్యాంకు ఖాతాలో నష్ట పరిహారం జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు కష్టాలను ఎదుర్కొని పంటలు పండించి ప్రకృతి ప్రకోపానికి పూర్తిగా నష్టపోయారని వారిని ఆదుకుని అండగా వుంటామని తెలిపారు. వారితో పాటు రైతన్నలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోశాలను పరిశీలించిన ఎమ్మెల్యే

కంప్లి, మే 10 : విజయనగర జిల్లా కూడ్లిగి తాలుకా దండు బొమ్మనహళ్లి గ్రామంలో వుండే గోశాలను ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాసులు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కూడ్లిగి ఎమ్మెల్యే మాట్లాడుతూ గోశాలకు మంచి పశుగ్రాసం అందించాలన్నారు. అందులో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. పశుగ్రాసంతో పాటు నీరు వుండటానికి షెడ్లు ఏర్పాటు చేసి అక్కడ గోశాలలో సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు.



గోశాలకు వచ్చిన పశుగ్రాసాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పట్టుబడిన గ్యాస్ సిలిండర్‌ల దొంగ

రాయచూరు, మే 10 : నగరంలోని ఎం.ఈరణ్ణ సర్కిల్ సమీపంలోగల సిరాజుల్ ఉల్మ్ మసీదులో గత నెలలో వంట సిలెండర్‌లను ఎత్తుకెళ్లిన దొంగ శుక్రవారం సదర్‌బజార్ పోలీసులకు పట్టుబడ్డాడు. రంజాన్ పండుగ సందర్భంగా ఇఫ్తార్ విందు కోసం మసీద్ వద్ద ఉంచిన సిలెండర్‌లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లాడు. బాధితులు విషయాన్ని సదర్‌బజార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడిని గుర్తించి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 36 వేల విలువ చేసే 9 సిలెండర్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని నగరానికి చెందిన రాముగా గుర్తించి కేసు నమోదు చేశారు.

వైభవంగా బసవేశ్వరస్వామి రథోత్సవం

కంప్లి, మే 10 : కంప్లి తాలుకా పరిధిలోని దేవసముద్రం గ్రామంలో బసవ జయంతి సందర్భంగా శుక్రవారం తిరుముల్లి బసవేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం గంగ పూజ, కుంభాభిషేకం, బసవేశ్వరస్వామి నీలమ్మలకు కళ్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి ఎదురుబసవన్న కట్ట వరకు రథోత్సవాన్ని జరిపారు. రథోత్సవంలో నంది కోళ్లు, డోళ్లు తదితరాలు పూర్తిగా ఆకట్టుకున్నాయి. దేవ సముద్రంతో పాటు మెట్రి, దేవలాపురం, జవుకు,జానూరు, నెల్లూడి, ఎమ్మిగనూరు, కంప్లి, రామసాగర, బళ్లారి, సిరుగుప్ప, హొస్పేట, గంగావతి తదితర పట్టణాల నుంచి వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొని పూలు, పండ్లతో స్వామివారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ రథోత్సవంలో కురేకుప్ప శరణు బసవ తాత, బుక్కసాగర విశ్వారాధ్య శివాచార్య స్వాములు, చిక్కినకొప్ప చెన్నవీరశరణు స్వాములు, లింగనగౌడ, హళ్లళ్లి వీరేష్, మల్లి గౌడ, బసన్న గౌడ, గణేష్ గౌడ, కడేమనె పంపాపతి, గ్రామ పంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవం సందర్భంగా మద్యపాన నిషేధం

కొట్టూరు తాలుకాలోని ఉజ్జిని గ్రామంలో మరళ సిద్దేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా ఈ నెల 12, 13 తేదీలలో రెండు రోజుల పాటు మద్యపాన నిషేధం విధించినట్లు జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ తెలిపారు. పోలీసులు కూడా ఈ మరళ సిద్దేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా వివిధ షాపుల్లో మద్యం విక్రయించిన వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ఒకవేళ మద్యం విక్రయిస్తే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.



దేవసముద్రంలో సాగుతున్నబసవేశ్వరస్వామి రథోత్సవం

మావినళ్లిలో గడ్డివాముల దగ్ధం



మావినళ్లి గ్రామంలో కాలిబూడిదవుతున్న గడ్డివాములు

కంప్లి, మే 10 : కంప్లి తాలుకా పరిధిలోని మావినళ్లి గ్రామంలో సాయంత్రం మావినళ్లి గ్రామానికి చెందిన ఎం గోపాల్, హనుమంతరెడ్డిలకు చెందిన గడ్డివాములు దగ్ధమై లక్షల్లో నష్టం వాటిల్లినట్లు తెలిపారు. గడ్డివాముపైన విద్యుత్ తీగలు వుండటంతో షార్ట్ సర్క్యూట్ అయ్యి గడ్డివాములకు మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి. నష్టపోయిన రైతులకు పశుగ్రాసం అందించి రైతులను ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. గ్రామలెక్క అధికారి నష్టపోయిన పశుగ్రాసాన్ని పరిశీలించారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు.

టెన్త్ ఫలితాల్లో శ్రీనంద పాఠశాల విద్యార్థుల హవా

బళ్లారి సిటీ, మే 10: మార్చిలో జరిగిన పదోతరగతి వార్షిక పరీక్షల్లో శ్రీ నంద పాఠశాల విద్యార్థులు హవా చాటారని పాఠశాల చైర్మన్ వి.గాంధీ అన్నారు. గురుశాంత 582/625 మార్కులు సాధించి పాఠశాల మొదటి స్థానంలో నిలిచింది. రాజేశ్ నాయక్ 578, భూమిక 575, కే.రాజేశ్ 574 మార్కులు సాధించారు. వెన్నెల, శ్రావణి ప్రథమ భాషలో 125మార్కులకుగాను 119 మార్కులు సాధించగా, ద్వితీయ భాషలో గురుశాంత 100 మార్కులు సాధించారు. గౌతమ్ గణితంలో 100 వంద మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ వి.గాంధీ, కార్యదర్శి రమణకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.



గురుశాంత కే.రాజేశ్ రాజేశ్‌నాయక్ భూమిక

పదోతరగతి ఫలితాల్లో బెస్ట్ కళాశాల ఘన విజయం



వెంకటేశ్ ప్రజ్వల్ శ్రీనివాస నాయక్ సాత్విక నందిని రెడ్డి సాత్విక రఘు శ్రీహరి

బళ్లారి సిటీ, మే 10: పదోతరగతి ఫలితాల్లో బెస్ట్ పాఠశాల విద్యార్థులు ఘన విజయాన్ని సాధించారు. మొత్తం 231 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 27మంది ఏ+శ్రేణి, 49మంది ఏ శ్రేణి ఉత్తీర్ణత సాధించారని ప్రధాన ఆచార్యుడు తెలిపారు. శ్రీనివాస్‌నాయక్ 609మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచారు. రఘు 608, హరి 604, నందిరెడ్డి సాత్విక 599, సాత్విక 598, ప్రజ్వల్ 592, శ్రీనివాస్ శంకర్‌నాయక్ 589, గిరీశ్ 588, ఎల్లమంచలి తేజస్వి588, తన్మయి 587 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ కోనంకి రామప్ప ,ఉపాధ్యక్షులు కోనంకి తిలక్‌కమార్, కార్యదర్శి మన్నెం శ్రీనివాసులు, విజయలక్ష్మీ, ముఖ్యఉపాధ్యాయురాలు అరుణకుమారి అభినందించారు.

ఉన్నత విద్యతోనే ఉత్తమ జీవితం: కృష్ణగిరి కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి), మే 10: సగటు విద్యార్థి తన జీవితంలో స్థిరపడేందుకు ఉన్నత విద్య మార్గదర్శకం కానుందని కలెక్టర్ సరయు అభిప్రాయపడ్డారు. కృష్ణగిరి విజయ్ విద్యాలయ మెట్రిక్ హయ్యర్ సెకండరీ పాఠశాల ఆవరణలో 12వ తరగతి విద్యార్థులకు ఉన్నతవిద్యకు మార్గనిర్దేశన చేసే కౌన్సెలింగ్ శిబిరాన్ని శుక్రవారం ఆమె నిర్వహించారు. 2022లో తమిళనాడు ప్రభుత్వం పన్నెండవ తరగతి విద్యార్థుల కోసం కళాశాల డ్రీమ్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో తమిళనాడు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా మూడు కార్యక్రమాలు విద్యార్థులకు వివిధ మార్గాల్లో దోహదపడనున్నాయన్నారు. ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వృత్తిపరమైన నైపుణ్యం పెంచేలా ఉపాధి అవకాశాలు కల్పించనున్నామన్నారు.

హైటెన్షన్ విద్యుత్ వైర్ తగిలి వ్యక్తి మృతి

బళ్లారి గాంధీనగర్, మే 10: హైటెన్షన్ విద్యుత్ తీగ కాలికి తగలడంతో ఘటనాస్థలంలోనే ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన కొప్పళ జిల్లా కుకనూరు తాలూకా చిక్కనకొప్ప గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. చిక్కనకొప్ప గ్రామానికి చెందిన ఈరప్పకురి(55) గురువారం గొర్రెలను మేపడానికి వెళ్లాడు. కాని రాత్రి పొద్దుపోయినా అతడు ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికే ప్రయత్నం చేశారు. శుక్రవారం ఉదయం మృతి చెందిన ఈరప్ప కురి శవాన్ని పొలాల్లో గుర్తించారు. శవం ప్రక్కనే విద్యుత్ తీగ తెగిపడి ఉండడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు భావిస్తున్నారు. స్థానికంగా విండ్ పవర్ కంపెనీ ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ తెగిపడిన విషయాన్ని కంపెనీ గుర్తించక పోవడంతోనే అతడు మృతి చెందినట్లు గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విండ్ పవర్ కంపెనీపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి విండ్‌పవర్ కంపెనీ వారు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

94.8 శాతం మార్కులు సాధించిన అంధ విద్యార్థిని



అంధ విద్యార్థిని యుక్తి

బళ్లారి గాంధీనగర్, మే 10: దావణగెర నగరంలోని సిద్ధగంగా హైస్కూలులో చదువుతున్న అంధ విద్యార్థిని యుక్తి.పి ఎస్ఎస్ఎల్సీ పరీక్షల్లో 593మార్కులతో(94.88శాతం)ఉత్తీర్ణత సాధించింది. పుట్టుకతోనే అంధురాలైన యుక్తి, బెంగళూరులోని జ్యోతి సేవా అంధుల పాఠశాలలో 7వతరగతి వరకు చదివింది. అంధుల పాఠశాలకే పరిమితం కాకుండా సామాన్య విద్యార్థులతో కలిసి చదువుకోవాలనే ఉద్దేశ్యంతో యుక్తి దావణగెరలోని సిద్ధగంగా పాఠశాలలో 8వతరగతిలో చేరింది. పాఠశాల నుండి ల్యాప్ టాప్ అందుకున్న ఆ బాలిక ఎన్‌విడిఎ స్క్రీన్ రీడర్ సాఫ్ట్‌వేర్ ద్వారా విద్యను అభ్యసించింది. స్క్రైబ్ సహాయంతో ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలు రాసిన ఆమె ఎవరూ ఊహించని రీతిలో కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించింది. తాను భవిష్యత్‌లో ఇంగ్లీషు ఉపన్యాసకురాలు కావాలనుకుంటున్నానని పేర్కొంది.

హోసూరు జోన్

మత్తిగిరి క్యాటిల్ ఫారంలో పశుగ్రాసం కొరత



గడ్డి, నీరు లేక రోడ్లపై సంచరిస్తున్న పశువులు

హోసూరు, మే 10: హోసూరులోని క్యాటిల్‌ఫాంలో గ్రాసం, నీటి కొరతను పశువులు ఎదుర్కొంటున్నాయి. క్యాటిల్‌ఫాంలో పచ్చగడ్డి లేకపోవడంతో పశువులు మేతకోసం రోడ్డుపైకి వస్తున్నాయి. ఇటీవల కొన్ని రోజులుగా రోడ్లపై పశువుల సంచారం అధికమైంది. ఆసియాలోనే అతి పెద్ద పశువుల పెంపక కేంద్రమైన కృష్ణగిరి జిల్లాలోని హోసూరు సమీపాన మత్తిగిరిలో సుమారు 1500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న క్యాటిల్‌ఫామ్‌లో ఆవులు, గుర్రాలు, దేశవాళీ కోళ్లు, పందులు, మేకలు తదితర దేశీయ పశువులను పెంచుతున్నారు. గంగేయం, సింధు, పులిక్కుళం, బర్గూర్ కొండ ఆవులు వంటి వివిధ జాతుల ఆవులు ఉన్నాయి. మేత దొరకకపోవడంతో పశువులన్నీ హోసూరు డెంకణీకోట రోడ్డుపైకి వస్తున్నాయి. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కోసారి అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పశువులకు తగిన గ్రాసం, నీరు సమకూర్చడంతోపాటు రోడ్లపైకి పశువులు రాకుండా నియంత్రించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ శిబిరాలు

హోసూరు, మే 10: మండుతున్న ఎండలబారినుంచి రక్షించి, దాహార్తి తీర్చేలా హోసూరు కార్పొరేషన్ తరపున 18 చోట్ల ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్) పానీయాల శిబిరాలను ఏర్పాటు చేశారు.

పటాలమ్మదేవికి కుంభాభిషేకం

హోసూరు, మే 10: హోసూరు సమీపంలోని గోవింద అగ్రహారం గ్రామంలో కొలువైన పటాలమ్మ, మారియమ్మ దేవిలకు మహా కుంభాభిషేక కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గణపతి హోమం, నవగ్రహ హోమం, వాస్తుహోమం, యాగ కలశపూజలు నిర్వహించారు. అనంతరం గోపురంలోని కలశంపై పవిత్ర జలాన్ని సంప్రోక్షణ చేశారు. దేవాలయంపై పవిత్ర నదుల నుంచి తీసుకొచ్చిన జలాన్ని అభిషేకించారు. ఆ తర్వాత మూల విగ్రహాలకు క్షీరాభిషేకం, నెయ్యాభిషేకం, విభూతి అభిషేకం, ఇలా వివిధ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేష అలంకరణ గావించారు. ఉత్సవంలో కృష్ణగిరి జిల్లా నుంచే కాకుండా సరిహద్దులోని బెంగళూరు నగరం నుంచి భక్తులు పాల్గొన్నారు. భక్తుందరికీ తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.



ప్రత్యేకాలంకరణలో పటాలమ్మదేవి

బసవేశ్వరుడి వచనాలు నేటికి అనుసరణీయం

● జడ్పీ సీఈఓ రాహుల్ తుకారం పాండ్వే

● ఘనంగా క్రాంతియోగి బసవేశ్వరుడి జయంతి వేడుక



బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ బి.నిఖిల్

రాయచూరు, మే 10: కుల,మత , లింగ వివక్షలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా పని చేసిన క్రాంతియోగి బసవేశ్వరుడి ఆశయాలు అన్ని తరాలకు అనుసరణీయమని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారం పాండ్వే అన్నారు. బసవేశ్వరుని 899వ జయంతి పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని బసవేశ్వర సర్కిల్‌లోగల క్రాంతియోగి బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధికారికంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు,ప్రజాప్రతినిధులు దివంగత నేతకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●వైభవంగా బసవ జయంతి ఉత్సవం

జగత్‌జ్యోతి క్రాంతి పురుషుడు బసవేశ్వరుడుని జయంత్సోవాన్ని నగరంలో శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. జయంతిని పురస్కరించుకుని నగరంలోని వీరశైవ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాన్ని బిచ్చాలి శ్రీ వీరభద్ర శివాచార్య మహాస్వామి ప్రారంభించారు. అనంతరం స్వామీజీ ప్రసంగిస్తు, బసవేశ్వరుడి వచనాలు, నేటికి అనుసరణీయమన్నారు. పేర్లు వేరైనా దైవం ఒక్కడేనన్న బసవేశ్వరుని ఆదర్శం, నేటి తరానికి అన్వయించకపోవడం అత్యవసరమని సూచించారు. కుల మతాల కతీతంగా తమ సమాజ స్థాపన కోసం బసవేశ్వరుడు చేసిన కృషి నేటి సమాజానికి ఆదర్శనీయమని శ్లాఘించారు. సామాజిక రుగ్మతల నివారణ కోసం జీవితాన్నర్పించిన మహనీయుడు బసవేశ్వరుడని కీర్తించారు. బసవ కేంద్రం, వీరశైవ నౌకర్ల సంఘం నిర్వహించిన కార్యక్రమానికి వీరశైవ సమాజం ప్రముఖులు పాల్గొన్నారు.